# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్టణాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

2. **పెట్టుబడుల అనుకూల విధానాలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ప్రారంభమైన పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి జాతీయ మిషన్ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.**

4. **వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు జీఎస్టీ సంస్కరణలు చోదక శక్తిగా నిలుస్తాయని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.**

============================

విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఢిల్లీలో ఆ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం సందర్భంగా 'భారత్ ఏఐ శక్తి' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ..31 సెకన్లు

అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, సాంకేతికత ప్రపంచాన్ని మారుస్తోందని అన్నారు. కృత్రిమ మేధ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, నైపుణ్యం ఉన్న యువతకు మరిన్ని అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు.

---------------------------

పెట్టుబడుల అనుకూల విధానాలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఢిల్లీలో గూగుల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ డేటా సెంటర్ ద్వారా ప్రపంచ స్థాయి కృత్రిమ మేధ నిపుణులు తయారయ్యేందుకు అవకాశముంటుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా

రాష్ట్రానికి మరిన్ని ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 33 సెకన్లు

---------------------------

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ప్రారంభమైన పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల కల్పన కోసం ఉద్దేశించిన జాతీయ మిషన్ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ 2025-26 ప్రకటనల అమలుపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విధానం, ప్రతిపాదనలను కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు అందజేస్తారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రతిపాదనలతో పాటు, రాష్ట్ర పర్యాటక శాఖలో అవలంభిస్తున్న విధానాలు వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకోనున్న చర్యలను మంత్రి వివరిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

వస్తు సేవల పన్ను- జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 16వ తేదీన కర్నూలులో పాల్గొనే బహిరంగ సభకు రాష్ట్ర పోలీసు యంత్రాంగం కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభకు ఏడు వేల మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి పర్యటించే ప్రాంతాలలో రెండు వందల నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈరోజు నుండి ఆ ప్రాంతంలో 16వ తేదీ వరకూ డ్రోన్ల ఎగురవేతపై నిషేధం విధించారు.

---------------------------

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు వస్తు సేవల పన్ను – జీఎస్టీ సంస్కరణలు చోదక శక్తిగా నిలుస్తాయని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని పున్నమిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన "గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్"ను జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెటు సభ్యులు మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపులు వాణిజ్య, వ్యాపార రంగాల ఆర్థిక అభివృద్ధికి మరింత దోహదం చేస్తాయన్నారు. ప్రజలకు జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నామని కేశినేని శివనాథ్ తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం -ఏ.పి.ఎస్.పి.ఎఫ్ 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని ఏ.పి.ఎస్.పి.ఎఫ్ డైరెక్టర్ జనరల్ సి.యం.త్రివిక్రమ వర్మ తెలిపారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో క్రీడా పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా సిబ్బందిలో మెరుగైన క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం పెంపొందుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమి తేడా లేదని, క్రీడా స్ఫూర్తి గొప్పదని అన్నారు.నూతన నియామకాలు చేపట్టి ఏ.పి.ఎస్.పి.ఎఫ్ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

---------------------------

బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరంలో పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల తహిసీల్దారు షేక్ సలీమా తెలిపారు. సూర్యలంక సముద్ర తీరాన్ని ఆమె ఈ రోజు పరిశీలించి తీరం వెంబడి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సలీమా మాట్లాడుతూ, సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు లోతుకు వెళ్లకుండా మైకుల ద్వారా అప్రమత్తం చేయడంతో పాటుగా సముద్ర స్నానాలు ఆచరించే క్రమంలో లోతుకు వెళ్లకుండా అవగాహనా కల్పించాలన్నారు. ప్రమాదాలను నియంత్రించడానికి పర్యాటకుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

-------------------------

బాలికలు విద్యావంతులు కావడం ద్వారా సమాజ పురోగతి సాధ్యమవుతుందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా సమగ్ర శిశు అభివృద్ధి పథకం– ఐ.సి.డి.ఎస్. ఆధ్వర్యంలో నెల్లూరులో ఈరోజు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక మహిళ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. బాలికలకు విద్య, హక్కులు, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

-------------------------

కోస్తాంధ్ర ప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

-------------------------

ఏలూరు జిల్లాలో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం రెండవ దశలో భాగంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం గ్రామంలో 6 కోట్ల రూపాయలతో చేపట్టనున్న గ్రామాభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు నిన్న వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు.

=====================